RNI NO: APTEL/26/A5325

www.mahinewsindia.com

# మహా న్యూస్

Epaper: https://epaper.mahinewsindia.com

తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. | సంపుటి : 01 | సంచిక :120 | ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య. | పేజీలు : 4 | వెల రూ. 2 | శనివారం -17 - అక్టోబర్ - 2026

Published From : Chittoor circulated by YSR Kadapa I Anatapuram I Kurnool I East & West Godavari I Guntur I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad & Telangana





2లో

## విజయవాడలో ఎన్టీఆర్ ట్రస్ట్ బ్లడ్ బ్యాంక్.. నారా భువనేశ్వరికి చంద్రబాబు అభినందనలు

- విజయవాడలో ఎన్టీఆర్ ట్రస్ట్ రక్త నిధి కేంద్రం ఏర్పాటును అభినందించిన సీఎం చంద్రబాబు
- సంస్థ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి బృందానికి ప్రత్యేక అభినందనలు
- తలసేమియా చిన్నారులకు ఉచిత రక్తం అందించడం గొప్ప మానవీయ సేవ అని కొనియాడారు
- విద్యా, వైద్య రంగాల్లో ట్రస్ట్ అందిస్తున్న సేవలను ప్రస్తావించిన ముఖ్యమంత్రి
- ప్రాణ రక్షణే లక్ష్యంగా ట్రస్ట్ ముందుకు సాగాలని ఆకాంక్ష

# స్థానిక సమరానికి టీడీపీ సై.. చంద్రబాబు పక్కా వ్యూహం

### పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారించిన టీడీపీ అధిష్ఠానం

- ★ సీఎం చంద్రబాబు, లోకేశ్, పల్లా నేతృత్వంలో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ
- ★ క్షేత్రస్థాయి అభిప్రాయాలు, ప్రజామోదం ఆధారంగా వడపోత
- ★ మేయర్లు, ఛైర్మన్ల ప్రత్యక్ష ఎన్నిక నేపథ్యంలో అభ్యర్థుల ఎంపికలో ప్రత్యేక శ్రద్ధ
- ★ ట్రిపుల్ ఇంజన్ సర్కార్ ఏర్పాటుతో అభివృద్ధిని వేగవంతం చేయడమే లక్ష్యం



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలైన నేపథ్యంలో అధికార తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల ఎంపికపై పూర్తిస్థాయిలో దృష్టి సారించింది. కూటమి భాగస్వామ్య పక్షాలతో సీట్ల సర్దుబాటు ప్రక్రియను పూర్తి చేసిన టీడీపీ అధిష్ఠానం, ఇప్పుడు గెలుపు గుర్రాలను మిగతా 2 లో

## జనసేన 'గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్' ప్రారంభించిన పవన్ కల్యాణ్



2లో

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం జనసేన ప్రచార రథం ప్రారంభం
- 'గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్'ను జెండా ఊపి ప్రారంభించిన పవన్ కల్యాణ్
- అభ్యర్థి గడల శ్రీనివాసరావు గెలుపునకు పలు సూచనలు
- యువత సమస్యలు తెలుసుకునే వేదికగా ఉండాలని పిలుపు

## మద్యం సీసాలు పెట్టి అరెస్ట్ చేశారు.. ఇది పోలీసుల నాటకం: అంబటి రాంబాబు



2లో

- స్థానిక ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులను ప్రభుత్వం టార్గెట్ చేస్తోందని అంబటి ఆరోపణ
- దాచేపల్లి అభ్యర్థిని మద్యం కేసులో అక్రమంగా ఇరికించారని విమర్శ
- ఏకగ్రీవాల కోసమే పోలీసులు తప్పుడు కేసులు పెడుతున్నారన్న అంబటి



2లో

## ఇది కాంగ్రెస్ చేతగానితనం వల్ల వచ్చిన కరవు.. 1,000 టీఎంసీల నీళ్లను వృథాగా దిగువకు వదిలారు: కేటీఆర్

- తెలంగాణలో నీటి ఎద్దడికి కాంగ్రెస్ నిర్లక్ష్యమే కారణమని కేటీఆర్ ఆరోపణ
- 1,000 టీఎంసీల గోదావరి, కృష్ణా జలాలు వృథాగా దిగువకు వెళ్లాయని వ్యాఖ్య
- కన్నెపల్లి, దేవాదుల పంపులను సక్రమంగా వినియోగించలేదని విమర్శ
- పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి పంపులు ఆన్ చేయలేదని ఆరోపణ



2లో

## బంగ్లాదేశ్ తరహాలో పాలన మార్పునకు కాంగ్రెస్ కుట్ర.. రాహుల్‌పై రాజ్‌నాథ్ సంచలన ఆరోపణలు

- భారత్‌లో బంగ్లాదేశ్ తరహా పాలన మార్పునకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని రాజ్‌నాథ్ ఆరోపణ
- ప్రజాస్వామ్యం పేరుతో దేశంలో అరాచకం సృష్టించాలని చూస్తోందని విమర్శ

## అమెరికా మంత్రి పర్యటన: జైశంకర్‌పై రాహుల్ గాంధీ వ్యాఖ్యలతో రాజకీయ దుమారం

### విదేశాంగ మంత్రి జైశంకర్‌ను 'రూబియో సిబ్బంది' అంటూ పరోక్షంగా వ్యాఖ్యలు

- అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో భారత పర్యటనపై రాహుల్ గాంధీ విమర్శలు
- విదేశాంగ శాఖ అధికారులు గందరగోళంలో ఉన్నారంటూ 'ఎక్స్' వేదికగా పోస్ట్



ఢిల్లీ: అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో భారత పర్యటనకు ముందే రాజకీయ వివాదం నెలకొంది. ఈ పర్యటన నేపథ్యంలో మిగతా 2 లో

## జెలెన్‌స్కీ సరైన వ్యక్తి కాదు ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

### ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీపై ట్రంప్ తీవ్ర విమర్శలు

- పుతిన్‌తో కంటే జెలెన్‌స్కీతో వ్యవహరించడమే కష్టమన్న ట్రంప్
- ఉక్రెయిన్ ప్రజలు మరో వ్యక్తిని ఎన్నుకుంటే మంచిదని సూచన



ఢిల్లీ: ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. జెలెన్‌స్కీ అమెరికాతో మిగతా 2 లో



2లో

## రాహుల్ తాటాకు చప్పుళ్లకు భయపడం: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

- కేంద్ర ప్రభుత్వాన్ని కూల్చేందుకు విపక్షాలు కుట్ర చేస్తున్నాయని ఆరోపణ
- పది నెలల్లో మోదీ సర్కార్ పడిపోతుందని దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శ
- 2029 వరకు మోదీ ప్రధానిగా ఉండాలని ప్రజలు తీర్పు ఇచ్చారని వ్యాఖ్య

హైదరాబాద్: కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు ప్రతిపక్షాలు కుట్రలు పన్నుతున్నాయని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి తీవ్రంగా ఆరోపించారు. మిగతా 2 లో

# జహీరాబాద్‌లో రూ. 8,528 కోట్లతో ఆర్ అండ్ డీ కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదన

### తెలంగాణకు మరో దిగ్గజ కంపెనీ.. సీఎం రేవంత్‌తో హ్యుందాయ్ ప్రతినిధుల భేటీ



- ★ సీఎం రేవంత్ రెడ్డితో సమావేశమైన హ్యుందాయ్ మోటార్స్ ఇండియా ప్రతినిధులు
- ★ ఈ కేంద్రం ద్వారా 4,275 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని వెల్లడి
- ★ అనుమతులు వేగంగా జారీ చేయాలని అధికారులను ఆదేశించిన సీఎం రేవంత్

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రానికి మరో భారీ పెట్టుబడి రాబోతోంది. ప్రపంచ ప్రసిద్ధ ఆటోమొబైల్ దిగ్గజం హ్యుందాయ్ మోటార్స్ ఇండియా, రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. ఇందులో భాగంగా సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో రూ. 8,528 కోట్ల వ్యయంతో అత్యాధునిక రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్ అండ్ డీ) కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆ సంస్థ ప్రకటించింది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు ద్వారా సుమారు 4,275 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలు మిగతా 2 లో



2లో

## ఖైరతాబాద్ ఉపఎన్నికలో బలమైన అభ్యర్థిని నిలబెడతాం: కవిత

- ఖైరతాబాద్ ఉపఎన్నికలో తమ పార్టీ కచ్చితంగా పోటీ చేస్తుందన్న కవిత
- రేవంత్ పాలన పక్కన పెట్టేశారని విమర్శ
- రాబోయే ఏడెనిమిది నెలల పాటు ప్రజల్లోనే ఉంటామని వెల్లడి

హైదరాబాద్: తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఖైరతాబాద్ అసెంబ్లీ ఉపఎన్నికపై స్పందించారు. మిగతా 2 లో

RNI NO. AP TEL/25/A0168 www.mahinewsindia.com Epaper: https://epaper.mahinewsindia.com

## జెలెన్‌స్కీ సరైన వ్యక్తి కాదు: ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

ఢిల్లీ: ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొడిమిర్ జెలెన్‌స్కీపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. జెలెన్‌స్కీ అమెరికాతో వ్యవహరించడానికి సరైన వ్యక్తి కాదని, రష్యా అధ్యక్షుడు పుతిన్ కంటే అతనితో చర్చలు జరపడమే కష్టంగా ఉందని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఉక్రెయిన్ ప్రజలు మరో నాయకుడిని ఎన్నుకుంటే మంచిదని కూడా సంచలన వ్యాఖ్యలు చేశారు. రష్యా ఆయిల్ రిఫైనరీలపై ఉక్రెయిన్ మళ్ళీ దాడులు ప్రారంభించడంపై ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దాడులను అవమానకరంగా ఆయన అభివర్ణించారు. శాంతి కావాలని పైకి చెబుతూనే, జెలెన్‌స్కీ యుద్ధాన్ని కొనసాగించాలని చూస్తున్నారని ఆరోపించారు. ప్రపంచానికి ఇంధనం అవసరమైన తరుణంలో రిఫైనరీలపై దాడులు చేయడం సరికాదన్నారు. కొన్ని రోజుల క్రితం ట్రంప్ ఏకపక్షంగా ప్రకటించిన 'ఇంధన కాల్పుల విరమణ' ఒప్పందాన్ని రష్యా గౌరవించలేదని ఉక్రెయిన్ ఆరోపించింది. విరామ సమయంలోనూ రష్యా తమ ఇంధన వ్యవస్థలపై దాడులు కొనసాగించిందని, అందుకే తాము తిరిగి దాడులు ప్రారంభించాల్సి వచ్చిందని అధ్యక్షుడు జెలెన్‌స్కీ స్పష్టం చేశారు. దాడులపై ఉన్న ఆంక్షలు ఎత్తివేస్తున్నట్లు ఆయన తేల్చిచెప్పారు. ఈ పరిణామాల నడుమ, ఉక్రెయిన్ డ్రోన్లు రష్యాలోని రియాజాన్ ప్రాంతంలో ఉన్న ఆయిల్ రిఫైనరీపై దాడి చేయగా, భారీగా మంటలు చెలరేగాయి. మరోవైపు, మధ్య ఉక్రెయిన్‌పై రష్యా జరిపిన డ్రోన్ దాడుల్లో ముగ్గురు పౌరులు మరణించగా, మరో ఆరుగురు గాయపడ్డారు. దీంతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు మళ్ళీ తారాస్థాయికి చేరాయి.

## ఎల్‌నినోను ఎదుర్కొనడానికి ప్రజలకు అండగా నిలబడాలి

హైదరాబాద్: ఎల్‌నినో కారణంగా తలెత్తిన సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొనడానికి రాష్ట్ర రైతాంగంతో పాటు ప్రతి ఒక్కరూ సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రకృతి ప్రకోపించడంతో తలెత్తిన ఈ విపత్తును ఎదుర్కొనడంలో కేంద్ర ప్రభుత్వం సంపూర్ణంగా సహకరించాలని కోరారు. ఎల్‌నినో వల్ల ఉత్పన్నమైన పరిస్థితులపై దసరా పండుగ తర్వాత అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. పరిస్థితి తీవ్రతపై ఆ సమావేశంలో అన్ని పార్టీల సలహాలు, సూచనలు తీసుకుంటామని చెప్పారు. ఆ తర్వాత నవంబర్ మొదటి వారంలో అఖిల పక్ష ప్రతినిధి బృందంతో కలిసి ఢిల్లీకి వెళ్లి ప్రధానమంత్రి గారిని కలిసి సహకారం కోరుతామని చెప్పారు. ఈ సంక్షోభ కాలం నుంచి గట్టెక్కడానికి తీసుకోవలసిన చర్యలపై ముఖ్యమంత్రి అన్ని శాఖలను అప్రమత్తం చేశారు. ముఖ్యమంత్రి అందుబాటులో ఉన్న మంత్రులు, ఆయా శాఖల ఉన్నతాధికారులతో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సమావేశమై ఎల్‌నినో ప్రభావం, వర్షాభావం, సాగు, తాగునీటి ఎద్దడి, తద్వారా ఉత్పన్నమయ్యే పరిస్థితులపై సమగ్రంగా సమీక్షించారు. ఎల్‌నినో కారణంగా ఉత్పన్నమయ్యే పరిస్థితులు, తీసుకోవలసిన చర్యలపై ప్రణాళికల గురించి ముఖ్యమంత్రి వివరించి ప్రతి ఒక్కరూ సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. "సమస్య తీవ్రతను దృష్టిలో పెట్టుకుని రైతులు పెద్ద మనసుతో ఎండాకాలం పంటలు వేయడం తగ్గించుకోవాలి. ఒక సీజన్ పంట పండించే పనులను వాయిదా వేసుకొని, ఉన్న నీటిని తాగడానికి వినియోగించుకోవాలి. ఎల్‌నినోను ఎదుర్కొనడానికి ప్రజలకు అండగా నిలబడాలని రైతులకు విజ్ఞప్తి చేస్తున్నా. ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా, తప్పుడు ప్రచారం నమ్మి వరి పంటలు వేస్తే నీరు అందించలేక పంటలు ఎండిపోయి పెట్టుబడి నష్టపోవడమే కాకుండా మోటార్లు, మీటర్లు కాలిపోయే పరిస్థితులు తలెత్తుతాయి. పెద్దమనసుతో ఒక సీజన్‌ను వాయిదా వేసుకోవాలి. రైతులతో పాటు ఈ సంక్షోభ పరిస్థితుల్లో భూమిలేని నిరుపేద కూలీలను ఆదుకోవలసిన అవసరం ఉంది. ఈసారి 2.5 లక్షల మంది ఉపాధి హామీ కూలీ పనులకు వస్తున్నారు. ఉపాధి హామీ పనుల కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని మంత్రి గారికి సూచించడం జరిగింది. ప్రస్తుత కాలంలో పంట నష్టపోయిన వారికి, ఎండాకాలంలో వాయిదా వేసుకునే పంట నష్టానికి కూడా కేంద్ర ప్రభుత్వం ప్రకృతి విపత్తుల నిధి నుంచి సహకారం అందించాలి. మార్చి నెలలో ఉండే ఎండలు ఇప్పుడే ఉన్నాయి. 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతోంది. రానున్న కాలంలో నీరు, విద్యుత్ విషయంలో తీవ్ర సమస్య ఎదుర్కోబోతున్నాం. ఈ ఏడాది వర్షాలు తక్కువగా కురుస్తాయని, ఆరుతడి పంటలు వేసుకోవాలని వర్షాకాలం ప్రారంభం నుంచి చెబుతూవచ్చాం. గడిచిన 3 సంవత్సరాల్లో సగటున 15 వేల మెగావాట్ల విద్యుత్ వినియోగం ఉండగా, ఈరోజు 20 వేల మెగావాట్లకు చేరుకుంది. 2014-15 నాటికి సగటున 6500 -- 7,000 మెగావాట్ల వినియోగం ఉండగా, ఈ 13 ఏళ్లలో 14 వేల మెగావాట్ల వినియోగం పెరిగింది. గడిచిన రెండేళ్లలో ఆరేడు వేల వినియోగం పెరిగింది. ఈ పరిస్థితుల్లో కూడా రైతులకు, పరిశ్రమలకు వీలైనంత మేరకు విద్యుత్ అందించడానికి అహర్నిశలు కృషి చేస్తున్నాం. ఇంకో 15 - 20 రోజుల్లో వర్షాకాలం పంటలు కోతలు అయిపోతాయి. చేతికొచ్చిన పంట ఎండిపోకూడదు. రైతుకు నష్టం, కష్టం రాకూడదు. రైతును ఆదుకోవాలనే ఆలోచనతో.. మార్కెట్‌లో ఎక్కడ, ఏ రేటుకు దొరికినా విద్యుత్‌ను కొనుగోలు చేసి రైతులకు అందించే ప్రయత్నం చేస్తున్నాం. తెలంగాణ మాత్రమే కాకుండా అనేక రాష్ట్రాలు విద్యుత్ కొరతను ఎదుర్కొంటున్నాయి. ఉత్పత్తికన్నా వినియోగం పెరగడంతో విద్యుత్ లభించని పరిస్థితులు తలెత్తాయి. ఈ పరిస్థితుల నేపథ్యంలో రైతులు మనోధైర్యం కోల్పోకుండా ఉండాలని అన్ని రకాలుగా ప్రయత్నాలు చేశాం. చలికాలం ప్రారంభానికి ముందే రిజర్వాయర్లు వట్టిపోయే పరిస్థితులు వచ్చాయి. పోయిన సంవత్సరం ఇదే సమయానికి రిజర్వాయర్లలో 462 టీఎంసీల నీరుండగా, ఇప్పుడు 200 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉంది. అందుబాటులో ఉన్న నీటిని రాబోయే జూన్ వరకు 8 నుంచి 10 నెలలు పొదుపుగా వాడుకోవలసిన అవసరముంది. తాగునీటికే కష్టమైన పరిస్థితులు ఉన్నాయి. రాష్ట్రంలో 24 వేల గ్రామాలకు మంచినీటి సరఫరా చేయాల్సిన అవసరం ఉంది. ప్రపంచంలోని దాదాపు వంద దేశాల్లో ఎల్‌నినో ప్రభావం ఉంటుందని ఐక్యరాజ్య సమితి ప్రకటించింది. ఈ ప్రకృతి విపత్తు కారణంగా తీవ్రమైన నీటి ఎద్దడి, ఎండ వేడిమితో పాటు రకరకాల సమస్యలు ఉత్పన్నం కాబోతున్నాయని శాస్త్రవేత్తలు ముందుగానే హెచ్చరించారు. ప్రజలు, ముఖ్యంగా రైతాంగం అప్రమత్తంగా ఉండాల్సిన సమయం. ఎల్‌నినో ప్రభావం మొదటగా రైతాంగంపై ప్రభావం చూపనుంది. ముఖ్యంగా సాగునీరు, తాగునీరుతో పాటు విద్యుత్ రంగంపై తీవ్ర ప్రభావం చూపనుంది. తద్వారా పరిశ్రమలు, ప్రజా జీవితం, దినసరి కార్యక్రమాలపైన కూడా తీవ్రమైన ప్రభావం పడనుంది. కనీవినీ ఎరుగని విద్యుత్ వినియోగం జరుగుతోంది. ఉత్పత్తి చేయగలిగిన రాష్ట్రాల నుంచి కేంద్రం సెంట్రల్ పూల్ నుంచి రాష్ట్రానికి సబ్సిడీపై అదనంగా విద్యుత్ ఇవ్వాల్సిన అవసరం ఉంది. మన అవసరాలకు అనుగుణంగా రాబోయే 10 నెలల వినియోగం ఎంత అవసరమో అంచనా వేసి అందుకు అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించాం. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని ఆశిస్తున్నాం. ఒక విపత్తు సమయంలో కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వంతో పాటు రాష్ట్రంలోని ప్రతిపక్ష పార్టీ, ఇతర రాజకీయ పార్టీలు, సంఘాలు, మహిళా, విద్యార్థి సంఘాలు సహకరించాలని విజ్ఞప్తి. ఈ ప్రకృతి విపత్తును జయించడానికి అందరి సహకారం కావాలి. ఎల్‌నినో విపత్తుకు సంబంధించి తప్పుడు సమాచారాన్ని ఎవరూ వ్యాప్తి చేయొద్దు. ఎల్‌నినో కారణంగా తలెత్తిన పరిస్థితుల నేపథ్యంలో 24 గంటల పాటు ప్రజలకు సరైన సమాచారం అందించడానికి ప్రత్యేకంగా ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమించాం. అపోహలు, తప్పుడు ప్రచారం కల్పించకుండా ప్రభుత్వం తరఫున ఎప్పటికప్పుడు సమాచారం కోసం టోల్ ఫ్రీ నంబర్‌తో ఒక వార్ రూమ్‌ను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తూ పరిశీలిస్తూ ప్రజలను అప్రమత్తం చేసుకుంటూ భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తాం. సాగునీరు, తాగునీటిని ఆదా చేసుకోవడం, కూలీలకు పనులు కల్పించడంతో పాటు పశువులకు గ్రాసం, తాగునీరు అవసరాలకు సంబంధించిన అన్ని జాగ్రత్తలు తీసుకోవలసిన అవసరం ఉంది. తీవ్రమైన ఎండల నేపథ్యంలో ఆరోగ్య పరంగా ఏ కష్టమొచ్చిన నిరుపేదలను ఆదుకోవడానికి వైద్య ఆరోగ్య శాఖను అప్రమత్తం చేస్తున్నాం" అని ముఖ్యమంత్రి గారు సవివరంగా తెలిపారు. ఈ విపత్తు పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించడానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గారి నేతృత్వంలో సబ్ కమిటీని నియమించారు. అలాగే ప్రజలకు ఎప్పటికప్పుడు అధికారికంగా సమాచారం అందించడానికి సీఎం సలహాదారు కే. రామకృష్ణా రావు గారిని నోడల్ అధికారిగా నియమించారు.

## ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన అర్ధాంగి నారా భువనేశ్వరి శుక్రవారం విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు, సారెను వారు సమర్పించారు. ఇంద్రకీలాద్రికి చేరుకున్న ముఖ్యమంత్రి దంపతులకు దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు, ఆలయ కార్యనిర్వహణాధికారి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఆలయ మర్యాదలతో వారిని అమ్మవారి దర్శనానికి తీసుకువెళ్లారు. గర్భాలయంలో చంద్రబాబు దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం, రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి పట్టువస్త్రాలను, ఆయన అర్ధాంగి సారెను అమ్మవారికి సమర్పించారు. దర్శనం ముగిసిన అనంతరం, ఆలయ పండితులు ముఖ్యమంత్రి దంపతులకు వేదాశీర్వచనం అందజేశారు. అనంతరం వారికి అమ్మవారి తీర్థప్రసాదాలను, జ్ఞాపికను అందజేశారు. దసరా నవరాత్రుల సందర్భంగా ముఖ్యమంత్రి స్వయంగా అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయతీగా వస్తోంది. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం.. చర్చలు చివరి దశలో ఉన్నాయన్న నిర్మల!

ఢిల్లీ: భారత్-అమెరికా మధ్య ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న వాణిజ్య ఒప్పందం త్వరలోనే కార్యరూపం దాల్చనుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. అమెరికాతో జరుగుతున్న చర్చలు ప్రస్తుతం తుది దశకు చేరుకున్నాయని ఆమె తెలిపారు. బ్యాంకాక్‌లో నిర్వహిస్తున్న ఐఎంఎఫ్-ప్రపంచ బ్యాంక్ వార్షిక సమావేశాల్లో భాగంగా ఆమె ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఒప్పందానికి సంబంధించిన మొదటి దశ ఇప్పటికే ఖరారైందని, ప్రస్తుతం దీనికి సంబంధించిన న్యాయపరమైన ముసాయిదా (లీగల్ డ్రాఫ్ట్) సిద్ధం చేస్తున్నట్లు వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ తనకు వివరించారని నిర్మల తెలిపారు. త్వరలోనే ఈ ఒప్పందంపై సంతకాలు జరుగుతాయని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ వాణిజ్యంతో పాటు, ఇరు దేశాల ద్వైపాక్షిక ఆర్థిక, వాణిజ్య ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో భారత ఆర్థిక వ్యవస్థ పనితీరుపై కూడా మంత్రి ప్రసంగించారు. అంతర్జాతీయంగా అనేక అనిశ్చితులు నెలకొన్నప్పటికీ, భారత్ స్థిరమైన వృద్ధిని సాధిస్తోందని పేర్కొన్నారు. కోవిడ్ మహమ్మారి తదుపరి కాలంలో, గత నాలుగైదేళ్లుగా ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా భారత్ నిలిచిందని ఆమె గుర్తుచేశారు. ప్రభుత్వం అనుసరిస్తున్న సమ్మిళిత వృద్ధి విధానాలు, నైపుణ్యాభివృద్ధిలో పెట్టుబడులు, కఠినమైన ఆర్థిక క్రమశిక్షణ వంటి చర్యల వల్లే ఇది సాధ్యమైందని ఆమె వివరించారు. ప్రజాధనం వినియోగం పట్ల ప్రభుత్వానికి పూర్తి జవాబుదారీతనం ఉందని ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు.

## ఖైరతాబాద్ ఉపఎన్నికలో బలమైన అభ్యర్థిని నిలబెడతాం: కవిత

హైదరాబాద్: తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఖైరతాబాద్ అసెంబ్లీ ఉపఎన్నికపై స్పందించారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికలో తమ పార్టీ కచ్చితంగా పోటీ చేస్తుందని, బలమైన అభ్యర్థిని నిలబెడతామని ఆమె ప్రకటించారు. దసరా రోజున ఒక ఎమ్మెల్సీ అభ్యర్థిని కూడా ప్రకటిస్తామని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి పాలనను పక్కనపెట్టి రాజకీయాలపైనే దృష్టి సారిస్తున్నారని కవిత ఆరోపించారు. రాష్ట్రంలో రైతులు కరవుతో అల్లాడుతుంటే, ముఖ్యమంత్రి మాత్రం గోవా, ఢిల్లీ పర్యటనల్లో బిజీగా ఉన్నారని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు రాబోయే ఏడెనిమిది నెలల పాటు ప్రజల్లోనే ఉండి క్షేత్రస్థాయిలో పోరాడతామని కవిత స్పష్టం చేశారు. నవంబర్ చివరి వరకు రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్‌ను నిరంతరాయంగా అందించాలని డిమాండ్ చేశారు. మేడిగడ్డ బ్యారేజీ పనులను వెంటనే పునరుద్ధరించి పూర్తి చేయాలని కోరారు. పారదర్శకత కోసం ఇకపై అన్ని ఎన్నికలను ఈవీఎంలకు బదులుగా బ్యాలెట్ పేపర్లతోనే నిర్వహించాలని ఆమె డిమాండ్ చేశారు. గ్లోబల్ సమ్మిట్‌పై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయకపోతే అడ్డుకుంటామని హెచ్చరించారు.

## రాహుల్ తాటాకు చప్పుళ్లకు భయపడం: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్: కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు ప్రతిపక్షాలు కుట్రలు పన్నుతున్నాయని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి తీవ్రంగా ఆరోపించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలను ఆయన "తాటాకు చప్పుళ్లు"గా అభివర్ణించారు. ప్రజాతీర్పును గౌరవించకుండా, దేశంలో అరాచకాన్ని సృష్టించి ప్రభుత్వాన్ని కూలదోయాలని విపక్షాలు పగటి కలలు కంటున్నాయని ఆయన ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్య హక్కులను ప్రతిపక్షాలు దుర్వినియోగం చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. "పది నెలల్లో మోదీ ప్రభుత్వం కూలిపోతుంది" అంటూ కొన్ని పార్టీలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండించిన ఆయన, ఇది ప్రజాతీర్పును అవమానించడమేనని పేర్కొన్నారు. "ప్రధానిగా నరేంద్ర మోదీ 2029 వరకు కొనసాగాలని ప్రజలు స్పష్టమైన తీర్పునిచ్చారు. అయితే, బంగ్లాదేశ్, శ్రీలంక వంటి దేశాల్లో ప్రభుత్వాలను మార్చినట్లుగా ఇక్కడ కూడా చేయాలని ప్రతిపక్షాలు దింపుడుకల్లం ఆశలతో ఉన్నాయి. వారి ఆశలు ఎప్పటికీ నెరవేరవు" అని కిషన్‌రెడ్డి విమర్శించారు. ప్రపంచ దేశాలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నప్పటికీ, ప్రధాని మోదీ నాయకత్వంలో భారతదేశం స్థిరంగా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని ఆయన గుర్తుచేశారు. ప్రభుత్వ పనితీరును చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలు ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. రాహుల్ గాంధీ చేసే తాటాకు చప్పుళ్లకు మోదీ ప్రభుత్వం భయపడదని, తమ ప్రభుత్వం అత్యంత స్థిరంగా ఉందని, పూర్తికాలం కొనసాగుతుందని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు.

## జహీరాబాద్‌లో రూ. 8,528 కోట్లతో ఆర్ అండ్ డీ కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదన

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రానికి మరో భారీ పెట్టుబడి రాబోతోంది. ప్రపంచ ప్రసిద్ధ ఆటోమొబైల్ దిగ్గజం హ్యుందాయ్ మోటార్స్ ఇండియా, రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. ఇందులో భాగంగా సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో రూ. 8,528 కోట్ల వ్యయంతో అత్యాధునిక రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్ అండ్ డీ) కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆ సంస్థ ప్రకటించింది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు ద్వారా సుమారు 4,275 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. శుక్రవారం హ్యుందాయ్ మోటార్స్ ఇండియా ఇంజినీరింగ్ ఎండీ చాంగ్యో చో నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమైంది. ఈ భేటీ సందర్భంగా తమ పెట్టుబడి ప్రణాళికలను సీఎంకు వారు వివరించారు. జహీరాబాద్‌లో నెలకొల్పబోయే ఆర్ అండ్ డీ కేంద్రం స్వరూపం, దాని ద్వారా లభించే ఉపాధి కల్పన వివరాలను ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి తెలియజేశారు. హ్యుందాయ్ ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఆర్ అండ్ డీ కేంద్రం ఏర్పాటుకు అవసరమైన అనుమతులను వెంటనే జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఇదే క్రమంలో, తెలంగాణలో కార్ల తయారీ ప్లాంట్‌ను కూడా ఏర్పాటు చేయాలని హ్యుందాయ్ ప్రతినిధులను ఆయన ఆహ్వానించారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు అత్యంత అనుకూల వాతావరణం ఉందని, ప్రభుత్వ పరంగా అన్ని రకాల సహకారం అందిస్తామని ముఖ్యమంత్రి వారికి హామీ ఇచ్చారు. ఈ భారీ పెట్టుబడితో జహీరాబాద్ ప్రాంతం ఆటోమొబైల్ హబ్‌గా మరింత అభివృద్ధి చెందనుండటంతో పాటు, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు గణనీయంగా మెరుగుపడతాయని ప్రభుత్వం భావిస్తోంది.

## విజయవాడలో ఎన్టీఆర్ ట్రస్ట్ బ్లడ్ బ్యాంక్.. నారా భువనేశ్వరికి చంద్రబాబు అభినందనలు

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ అందిస్తున్న సేవలపై ప్రశంసల వర్షం కురిపించారు. విజయవాడలో కొత్తగా ఎన్టీఆర్ ట్రస్ట్ రక్త నిధి కేంద్రాన్ని ఏర్పాటు చేసిన నేపథ్యంలో, ఆయన ప్రత్యేకంగా అభినందించారు. రక్తం అందక ఏ ఒక్క ప్రాణమూ ప్రమాదంలో పడకూడదనే గొప్ప సంకల్పంతో ఈ కేంద్రాన్ని ప్రారంభించడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా తన అర్ధాంగి, సంస్థ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి, ఆమె బృందానికి చంద్రబాబు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. "ఒక్కరి రక్తదానం ఆపదలో ఉన్న మరో కుటుంబానికి జీవన ప్రదాత అవుతుంది. ప్రాణాపాయంలో ఉన్నవారికి పునర్జన్మనిస్తుంది" అని చంద్రబాబు పేర్కొన్నారు. ముఖ్యంగా తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు ఉచితంగా రక్తం అందించాలనే నిర్ణయం గొప్ప మానవీయ సేవ అని ఆయన కొనియాడారు. కేవలం బ్లడ్ బ్యాంక్ మాత్రమే కాకుండా, విద్యా, వైద్యం, మహిళా సాధికారత వంటి ఎన్నో రంగాల్లో ఎన్టీఆర్ ట్రస్ట్ అందిస్తున్న సేవలను చంద్రబాబు గుర్తుచేశారు. 'సంజీవని మొబైల్ క్లినిక్స్' ద్వారా మారుమూల గ్రామీణ, గిరిజన ప్రాంతాలకు వైద్య సేవలు చేరవేయడం స్ఫూర్తిదాయకమని ప్రశంసించారు. ప్రతి సేవలో మానవత్వం, ప్రతి ప్రయత్నంలో ప్రాణ రక్షణే లక్ష్యంగా ఎన్టీఆర్ ట్రస్ట్ తన సేవలను మరింతగా విస్తరించి, ఎంతో మందికి అండగా నిలవాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

## జనసేన 'గ్రాడ్యుయేట్ ఎక్స్ ప్రెస్' ప్రారంభించిన పవన్ కల్యాణ్

హైదరాబాద్: ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి జనసేన సిద్ధమైంది. ఈ ఎన్నికల కోసం ప్రత్యేకంగా రూపొందించిన 'జనసేన గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్' ప్రచార రథాన్ని పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ శుక్రవారం హైదరాబాదులో ప్రారంభించారు. ఈ సందర్భంగా వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ జనసేన అభ్యర్థిగా బరిలో ఉన్న డాక్టర్ గడల శ్రీనివాసరావుకు పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రచారానికి సంబంధించి ఆయనకు పలు సూచనలు చేశారు. ఈ 'గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్' కేవలం ఎన్నికల ప్రచార వాహనంగానే పరిమితం కాకూడదని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. యువత ఎదుర్కొంటున్న సమస్యలను నిరంతరం తెలుసుకుంటూ, వాటి పరిష్కారానికి కృషి చేసే ఒక ప్రజాసేవా వేదికగా ఇది కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. హైదరాబాదులోని జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది.

## మద్యం సీసాలు పెట్టి అరెస్ట్ చేశారు.. ఇది పోలీసుల నాటకం: అంబటి రాంబాబు

అమరావతి: స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీ అభ్యర్థులను లక్ష్యంగా చేసుకుని అధికార కూటమి ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకుని కుట్రలకు పాల్పడుతోందని వైసీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు తీవ్ర ఆరోపణలు చేశారు. దాచేపల్లి నగర పంచాయతీ వైసీపీ అభ్యర్థి కొప్పుల రవికుమార్‌ను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేశారని ఆయన మండిపడ్డారు. తెలంగాణ మద్యం అక్రమంగా నిల్వ ఉంచారనే నెపంతో పోలీసులు సోదాలు చేసి, వారే మద్యం సీసాలు పెట్టి నాటకీయంగా రవికుమార్‌ను అరెస్ట్ చేశారని అంబటి ఆరోపించారు. రవికుమార్ పోటీలో ఉంటే అధికార కూటమికి ఎందుకంత భయమని ఆయన ప్రశ్నించారు. తప్పుడు కేసులు పెట్టి, ఎన్నికలను ఏకగ్రీవం చేసుకోవడానికే ఈ అరెస్ట్ చేశారని విమర్శించారు. రవికుమార్ ఆర్థికంగా బలమైన కుటుంబానికి చెందినవారని, ఆయన తండ్రి సాంబయ్య గతంలో ఛైర్మన్‌గా పనిచేశారని గుర్తుచేశారు. వైసీపీ అభ్యర్థులను ప్రభుత్వం భయభ్రాంతులకు గురిచేస్తోందని అంబటి మండిపడ్డారు. నామినేషన్లకు అవసరమైన సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. ఇదే ప్రభుత్వం శాశ్వతంగా ఉండదని, పోలీసుల తీరు సరికాదని హెచ్చరించారు. రక్షించాల్సిన వారే భక్షించేలా వ్యవహరిస్తున్నారని అన్నారు. వెంటనే రవికుమార్‌ను విడుదల చేసి, స్వేచ్ఛగా పోటీ చేసే అవకాశం కల్పించాలని, పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.

## మిథున్ రెడ్డి కాన్వాయ్ పై దాడి ఒక రాక్షస క్రీడ.. ఏపీలో జంగిల్ రాజ్ నడుస్తోంది: జగన్

అమరావతి: రాజంపేట వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డిపై పుంగనూరులో దాడి జరిగిందంటూ ఆ పార్టీ అధినేత జగన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల్లో వ్యతిరేకత పెరగడంతో, ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటువంటి దాడులను ప్రోత్సహిస్తూ పాలిస్తున్నారని ఆయన మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్లు వేసేందుకు వెళుతున్న వైసీపీ అభ్యర్థులను, నాయకులను అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో 'జంగిల్ రాజ్' నడుస్తోందని, చంద్రబాబుకు హింస కొత్తేమీ కాదని జగన్ విమర్శించారు. పార్టీ లోక్‌సభాపక్ష నేతకు కూడా రక్షణ కల్పించలేని దుస్థితి నెలకొందన్నారు. ఓటమి భయంతోనే అధికార కూటమి దాడులకు దిగుతోందని, స్వేచ్ఛగా ఎన్నికలు జరిపే ఉద్దేశం వారికి లేదని ఆరోపించారు. కేంద్ర బలగాల పర్యవేక్షణలోనే ఎన్నికలు సజావుగా సాధ్యమవుతాయని జగన్ స్పష్టం చేశారు. మరోవైపు, మిథున్ రెడ్డితో జగన్ ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు. పుంగనూరులో మిథున్ రెడ్డి కాన్వాయ్‌ను టీడీపీ కార్యకర్తలు అడ్డుకుని రాళ్లు, కర్రలతో దాడికి పాల్పడ్డారని వైసీపీ వర్గాలు తెలిపాయి. ఈ ఘటనలో పలు వాహనాలు ధ్వంసం అయ్యాయని, మిథున్ రెడ్డి భద్రతా సిబ్బందికి గాయాలైనట్టు వైసీపీ వర్గాలు ఆరోపించాయి. అనంతరం అధికారులు ఆయన్ను నామినేషన్ కేంద్రంలోని ఒక ప్రత్యేక గదికి తరలించారు. ఈ దాడి సమయంలో పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారని వైసీపీ ఆరోపించింది.

## అమెరికా మంత్రి పర్యటన: జైశంకర్‌పై రాహుల్ గాంధీ వ్యాఖ్యలతో రాజకీయ దుమారం

ఢిల్లీ: అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో భారత పర్యటనకు ముందే రాజకీయ వివాదం నెలకొంది. ఈ పర్యటన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌ను లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. విదేశాంగ మంత్రిని ఉద్దేశించి ఆయన పరోక్షంగా 'రూబియో సిబ్బంది' అని సంబోధించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అసలేం జరిగింది?

వచ్చే వారం అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో భారత్‌లో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో ఉన్న రిలయన్స్ యూనిట్‌ను సందర్శించనున్నారు. అనంతరం ముంబైలో పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వ ఉన్నతాధికారులతో సమావేశమవుతారు. ఈ భేటీలలో విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కూడా పాల్గొంటారని అమెరికా రాయబారి సెర్గియో గోర్ వెల్లడించారు. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ కేంద్ర ప్రభుత్వంపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. "రూబియో తన సిబ్బందిని ముంబైకి రమ్మని ఆదేశించారు. మోదీ గారూ... విదేశాంగ మంత్రిత్వ శాఖలో మీ అధికారులు ఏం జరుగుతుందో తెలియక గందరగోళంలో ఉన్నారు. వారికి మీరైనా వివరించండి...! లేదా నన్ను చెప్పమంటారా...!" అని తన పోస్టులో పేర్కొన్నారు.

వివాదాస్పదమైన వ్యాఖ్యలు

రాహుల్ గాంధీ తన పోస్టులో ఎక్కడా జైశంకర్ పేరును నేరుగా ప్రస్తావించనప్పటికీ, "రూబియో తన సిబ్బందిని రమ్మన్నారు" అని అనడం ద్వారా పరోక్షంగా విదేశాంగ మంత్రిని ఉద్దేశించే ఈ వ్యాఖ్యలు చేశారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఒక దేశ విదేశాంగ మంత్రిని, మరో దేశ విదేశాంగ మంత్రికి చెందిన 'సిబ్బంది' (ఘుటట) గా అభివర్ణించడం అనుచితమని, ఇది దౌత్యపరమైన హోదాను కించపరచడమేనని విమర్శలు వస్తున్నాయి. విదేశాంగ శాఖ అధికారులు గందరగోళంలో ఉన్నారని పేర్కొనడం ద్వారా ప్రభుత్వ సమన్వయ లోపాన్ని ఎత్తిచూపే ప్రయత్నం చేశారని వారు అభిప్రాయపడుతున్నారు. ద్వైపాక్షిక వ్యూహాత్మక భాగస్వామ్యం, ప్రాంతీయ అభివృద్ధిలో పరస్పర సహకారం వంటి కీలక అంశాలపై చర్చించేందుకు రూబియో, జైశంకర్ మధ్య సమావేశం జరిగే అవకాశం ఉంది. ఇంతటి కీలకమైన పర్యటనకు ముందు రాహుల్ చేసిన వ్యాఖ్యలు అనవసర వివాదానికి దారితీశాయని అధికార వర్గాలు భావిస్తున్నాయి. ఈ వ్యాఖ్యలపై బీజేపీ నేతల నుంచి కూడా తీవ్ర ప్రతిస్పందన వచ్చే అవకాశం కనిపిస్తోంది.

## ఇది కాంగ్రెస్ చేతగానితనం వల్ల వచ్చిన కరవు.. 1,000 టీఎంసీల నీళ్లను వృథాగా దిగువకు వదిలారు: కేటీఆర్

హైదరాబాద్: తెలంగాణలో ప్రస్తుతం నెలకొన్న నీటి ఎద్దడికి ప్రకృతి కారణం కాదని, కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రాష్ట్రంలో కనిపిస్తున్నది కాలం తెచ్చిన కరవు కాదని, కాంగ్రెస్ సర్కారు తెచ్చిన 'చేతకాని కరవు' అని విమర్శించారు. పంపులు ఆన్ చేయకుండా, రిజర్వాయర్లను నింపకుండా నీటిని వృథాగా దిగువకు వదిలేశారని మండిపడ్డారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.

1,000 టీఎంసీల నీరు వృథా చేశారంటూ..

ఈ ఏడాది జూన్ 1 నుంచి ఇప్పటివరకు 750 టీఎంసీలకు పైగా గోదావరి నీటిని, 250 టీఎంసీల కృష్ణా జలాలను సముద్రంలోకి, దిగువ ప్రాంతాలకు వదిలేశారని కేటీఆర్ పేర్కొన్నారు. కన్నెపల్లి, దేవాదుల పంపులను సక్రమంగా నిర్వహించి వినియోగించుకుని ఉంటే గోదావరి పరివాహక ప్రాంతంలోని రిజర్వాయర్లు, చెరువులు నిండేవని అన్నారు. కానీ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోలేదని ఆరోపించారు.

కృష్ణా జలాలను వినియోగించుకునేందుకు వీలున్న పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి ఎత్తిపోతల పథకాల పంపులను ఆన్ చేయకుండా నిర్లక్ష్యం వహించారని విమర్శించారు. ప్రాజెక్టుల ద్వారా నీటిని ఎత్తిపోసి నిల్వ చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదని ధ్వజమెత్తారు.

ఎల్‌నినో హెచ్చరికలున్నా ముందస్తు చర్యలు లేవు

ఎల్‌నినో ప్రభావం ఉండవచ్చని మార్చి నుంచే వాతావరణ నిపుణులు హెచ్చరించినా కాంగ్రెస్ ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు రూపొందించలేదని కేటీఆర్ ఆరోపించారు. నీటి లభ్యతపై ముందుగానే అంచనాలు వేసి, సాగు, తాగునీటి అవసరాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాల్సిందని అన్నారు. మరోవైపు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను తరలించుకెళ్లిందని కేటీఆర్ పేర్కొన్నారు. పోతిరెడ్డిపాడు, వెలిగొండ సొరంగం ద్వారా కృష్ణా జలాలను వినియోగించుకుందని, కుప్పం ప్రాంతానికి కూడా నీటిని అందించిందని అన్నారు. తెలంగాణకు దక్కాల్సిన నీటి వాటాను కాపాడుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రాష్ట్రంలో నీటి ఎద్దడి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రాజెక్టుల నిర్వహణ, నీటి నిల్వలు, సాగు, తాగునీటి అవసరాలపై ప్రభుత్వం తక్షణమే దృష్టి పెట్టాలని కేటీఆర్ వ్యాఖ్యల సారాంశం. అయితే, నీటి విడుదలకు సంబంధించిన గణాంకాలు, ప్రభుత్వ నిర్లక్ష్యంపై చేసిన ఆరోపణలు కేటీఆర్ వెల్లడించినవే.

## స్థానిక సమరానికి టీడీపీ సై.. అభ్యర్థుల ఎంపికలో చంద్రబాబు పక్కా వ్యూహం

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలైన నేపథ్యంలో అధికార తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల ఎంపికపై పూర్తిస్థాయిలో దృష్టి సారించింది. కూటమి భాగస్వామ్య పక్షాలతో సీట్ల సర్దుబాటు ప్రక్రియను పూర్తి చేసిన టీడీపీ అధిష్ఠానం, ఇప్పుడు గెలుపు గుర్రాలను గుర్తించే పనిలో నిమగ్నమైంది. ముఖ్యమంత్రి, పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఈ ప్రక్రియను స్వయంగా పర్యవేక్షిస్తూ, సమర్థులైన అభ్యర్థులను బరిలోకి దించేందుకు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. ఈ కీలకమైన అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్, రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. కేవలం పార్టీ వద్ద ఉన్న సమాచారంపైనే ఆధారపడకుండా, క్షేత్రస్థాయిలో ప్రజల అభిప్రాయాలను విస్తృతంగా సేకరిస్తున్నారు. అభ్యర్థి వ్యక్తిగత ప్రతిష్ఠ, ప్రజామోదం, నాయకత్వ లక్షణాలు, సేవా నిబద్ధత వంటి అంశాలను ప్రధానంగా పరిగణనలోకి తీసుకుంటున్నారు. ప్రతి మున్సిపల్ కార్పొరేషన్, మునిసిపాలిటీకి సంబంధించి లోతైన విశ్లేషణ జరుపుతూ వడపోత కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహిస్తున్నారు. ఈసారి మేయర్లు, మునిసిపల్ ఛైర్మన్ల ఎన్నిక ప్రత్యక్ష పద్ధతిలో జరగనుండటంతో అభ్యర్థుల ఎంపిక మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ నేపథ్యంలో కేవలం పార్టీ కేడర్‌లోనే కాకుండా ప్రజల్లో మంచి పేరున్న, బలమైన అభ్యర్థులకే పట్టం కట్టాలని పార్టీ నాయకత్వం భావిస్తోంది. ప్రత్యక్ష ఎన్నికల్లో వ్యక్తిగత ఇమేజ్ గెలుపోటములను ప్రభావితం చేస్తుందన్న అంచనాతో అన్ని కోణాల్లో ఆలోచించి తుది నిర్ణయం తీసుకోనున్నారు. స్థానిక సంస్థల పాలన ప్రజల దైనందిన జీవితంతో ముడిపడి ఉంటుందని, అందుకే అత్యుత్తమ నాయకత్వాన్ని ప్రజలకు అందించాలన్నది తమ లక్ష్యమని టీడీపీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. కేంద్రం, రాష్ట్రంతో పాటు స్థానిక సంస్థల్లోనూ తమ పాలన ఉండేలా ట్రిపుల్ ఇంజన్ సర్కార్ ను ఏర్పాటు చేయడం ద్వారా రాష్ట్రాభివృద్ధిని మరింత వేగవంతం చేయవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భావిస్తున్నారు. ఈ లక్ష్య సాధనలో భాగంగానే స్థానిక ఎన్నికల్లోనూ సత్తా చాటేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారు.

## బంగ్లాదేశ్ తరహాలో పాలన మార్పునకు కాంగ్రెస్ కుట్ర.. రాహుల్‌పై రాజ్‌నాథ్ సంచలన ఆరోపణలు

ఢిల్లీ: బంగ్లాదేశ్‌లో జరిగిన తరహాలో భారత్‌లోనూ పాలన మార్పునకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుతున్నామనే పేరుతో దేశంలో అరాచకాన్ని సృష్టించేందుకు కాంగ్రెస్ నేతలు ప్రయత్నిస్తున్నారని, రాజ్యాంగ సంస్థలను దెబ్బతీయడమే వారి లక్ష్యమని విమర్శించారు. శుక్రవారం ఉత్తర్‌ప్రదేశ్‌లోని లఖ్‌నవూలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన కాంగ్రెస్, రాహుల్ గాంధీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశంలో ఇటీవలి పరిణామాలు అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నాయని రాజ్‌నాథ్ అన్నారు. యువత శక్తిని దేశ అభివృద్ధికి వినియోగించకుండా, రాజకీయ అస్థిరత సృష్టించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. బంగ్లాదేశ్ తరహాలో పాలన మార్పు తీసుకురావాలని కాంగ్రెస్ నేతలు బహిరంగంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. వారి వ్యాఖ్యలను బట్టి ప్రజాస్వామ్య సంస్థలను బలహీనపరచడమే ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోందన్నారు.

అధికారం కోసమే అరాచకమా?

ఎన్నికల సంఘం, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్), ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్నామని కాంగ్రెస్ చెబుతున్నా.. అసలు లక్ష్యం అధికారం చేజిక్కించుకోవడమేనని రాజ్‌నాథ్ ఆరోపించారు. 'పాలన మార్పు' వంటి పదాలను ఉపయోగించడం వెనుక ఉద్దేశం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. రాజకీయ స్వార్థం కోసం దేశ ప్రయోజనాలను పక్కనపెడితే ప్రజాస్వామ్య చర్చలు వాస్తవాల ఆధారంగా కాకుండా మొండివైఖరి, దుష్ప్రచారానికి వేదికగా మారతాయని వ్యాఖ్యానించారు.

ప్రజాస్వామ్యం పేరుతో అరాచకాన్ని సృష్టించడానికి, రాజ్యాంగ సంస్థలపై దాడులకు, దేశాభివృద్ధికి ఆటంకం కలిగించడానికి ఎవరికీ హక్కు లేదని రాహుల్ గాంధీని ఉద్దేశించి అన్నారు. చట్టాలను గౌరవిస్తూ శాంతిభద్రతలను కాపాడుకోవాలని, రాజకీయ ప్రయోజనాల కోసం రాజ్యాంగ వ్యవస్థలను దెబ్బతీయకూడదని సూచించారు. ప్రజల తీర్పును గౌరవించి, ప్రజాస్వామ్యాన్ని కాపాడుతున్నామనే పేరుతో రాజకీయ గందరగోళం సృష్టించడం మానుకోవాలని రాహుల్‌కు హితవు పలికారు.

ఇందిరాగాంధీ ఎమర్జెన్సీని గుర్తుచేస్తూ.. కాంగ్రెస్ గతంలోనూ ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువలను దెబ్బతీసిందని రాజ్‌నాథ్ విమర్శించారు. 1975లో ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీ, 1984లో సిక్కులపై జరిగిన హింస, 1990లో కరసేవకుల హత్యలకు సంబంధించిన పరిణామాలను ప్రస్తావించారు. నాటి నుంచి నేటి వరకు కాంగ్రెస్ వైఖరిలో మార్పు లేదని ఆరోపించారు. "1975లో ఇందిరాగాంధీ ప్రజాస్వామ్యాన్ని జైల్లో పెట్టారు. ఇప్పుడు రాహుల్ గాంధీ జేబులో రాజ్యాంగాన్ని పెట్టుకుని అరాచకం సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారు" అని రాజ్‌నాథ్ వ్యాఖ్యానించారు. ఎన్నికల సంఘాన్ని కాంగ్రెస్ రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుందని కూడా ఆయన ఆరోపించారు. 1993లో ఎన్నికల కమిషనర్ల నియామకం, అప్పటి ప్రధాన ఎన్నికల కమిషనర్ టీఎన్ శేషన్.. ఎన్నికల కమిషనర్ నవీన్ చావ్లాపై చేసిన ఆరోపణలను ప్రస్తావించారు. చావ్లా కాంగ్రెస్ నేతలకు ఎన్నికల సంఘానికి సంబంధించిన రహస్య సమాచారాన్ని చేరవేశారని శేషన్ ఆరోపించినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ ఆయనను తొలగించకుండా కాపాడటమే కాకుండా, తర్వాత ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా నియమించిందని రాజ్‌నాథ్ విమర్శించారు.

RNI : APTEL/25/A0108 www.mahinewsindia.com epaper: https://epaper.mahinewsindia.com

మీ న్యూస్ పోర్టల్, వెబ్‌సైట్ మరియు ఇ-పేపర్ కోసం
పూర్తి డిజిటల్ పరిష్కారం!
యూజర్ ఫ్రెండ్లీ, SEO సిద్ధంగా, AI ఆధారిత వెబ్‌సైట్‌లు
యూజర్ ఫ్రెండ్లీ డిజైన్
SEO సిద్ధంగా ఉన్న వెబ్‌సైట్‌లు (సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్)
AI ఆధారిత సాంకేతికత
AI ఆధారిత సాంకేతికత
మీ ఆన్‌లైన్ ఉనికిని పెంచుకోవడానికి మమ్మల్ని సంప్రదించండి
వెబ్‌సైట్: SRDIGITECH.COM
వాట్సాప్ నంబర్: 6300983567

# పుంగనూరు, తిరుపతి ఘటనలపై భూపేష్ రెడ్డి ఆగ్రహం

## దాడులు, నామినేషన్ల అడ్డగింత ప్రజాస్వామ్యానికి విరుద్ధం బాధ్యులపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలి



కడప జిల్లా/ జమ్మలమడుగు మహి న్యూస్, అక్టోబర్ 16: పుంగనూరు, తిరుపతి ప్రాంతాల్లో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలపై దాడులు, కూటమి అభ్యర్థుల నామినేషన్ల అడ్డగింత ఘటనలను కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు భూపేష్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఎన్నికల ప్రక్రియను దాడులు, బెదిరింపులతో అడ్డుకోవాలని చూడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని మండిపడ్డారు. కడప నగరంలోని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికల పరిశీలకుడు దీపక్ రెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. గత వైసీపీ పాలనలో చోటుచేసుకున్న దౌర్జన్యాలను మళ్లీ కొనసాగించాలని ప్రయత్నించడం సరికాదన్నారు. అభ్యర్థులపై దాడులు చేయడం, నామినేషన్ పత్రాలను చించివేయడం వంటి చర్యలను సహించేది లేదని స్పష్టం చేశారు.

### పుంగనూరు ఘటనపై విచారణ జరపాలి

పుంగనూరులో వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి తన అనుచరులతో కలిసి టీడీపీ నాయకులు, కార్యకర్తలపై దాడికి పాల్పడినట్లు, కారుతో ఢీకొట్టి నామినేషన్ల ప్రక్రియను అడ్డుకునేందుకు ప్రయత్నించినట్లు ఆరోపణలు వచ్చాయని భూపేష్ రెడ్డి పేర్కొన్నారు. ఈ ఘటనలో ఎంపీ ప్రమేయంపై వచ్చిన ఆరోపణలతో పాటు అన్ని అంశాలపై సమగ్ర విచారణ జరిపి, ఆధారాల మేరకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### తిరుపతిలోనూ దాడుల ఆరోపణలు

తిరుపతిలోని కొర్లగుంట మారుతీనగర్‌లో కూటమి అభ్యర్థుల నామినేషన్లను అడ్డుకున్న ఘటనను ఆయన ఖండించారు. కెనడీనగర్‌లో నామినేషన్ దాఖలు చేసేందుకు వెళ్తున్న టీడీపీ కార్యకర్త యశోదపై భూమన అభినయ్, ఆయన అనుచరులు దాడి చేసి నామినేషన్ పత్రాలను చించివేసినట్లు వచ్చిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా దౌర్జన్యాలు, అక్రమాలకు పాల్పడినట్లుగా ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలోనూ అలాంటి చర్యలకు పాల్పడాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఎన్నికల్లో ప్రజాస్వామ్యబద్ధంగా పోటీ చేసి ప్రజల మద్దతుతో గెలవాలని, ప్రత్యర్థులపై దాడులు చేయడం, నామినేషన్లను అడ్డుకోవడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు జయసుబ్బారెడ్డి, నజీముద్దీన్, అధికార ప్రతినిధి మన్సూర్ అక్బర్, మీడియా సమన్వయకర్త జనార్దన్, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిరుమలేష్ పాల్గొన్నారు.

# జాతీయ యువజన ఉత్సవాలకు యువతకు అవకాశం

## ఆన్‌లైన్ వ్యాసరచన పోటీల ద్వారా 200 మంది ఎంపిక

కడప జిల్లా। మహి న్యూస్। అక్టోబర్ 16: యువతలో నూతన ఆవిష్కరణలు, నాయకత్వ లక్షణాలను ప్రోత్సహించే లక్ష్యంతో రాష్ట్ర యువజన సేవల శాఖ, మై భారత్ సంయుక్త ఆధ్వర్యంలో 'వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్--2027' కార్యక్రమానికి సంబంధించి మూడు దశల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యనిర్వహణాధికారి బి.వి. ప్రసాదరావు తెలిపారు. మొదటి దశలో ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన ఎంపిక పోటీల నుంచి 1,000 మందిని ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. రెండో దశలో 'టెక్నాలజీ ఇన్నోవేషన్ -- ఫ్యూచర్ రెడీనెస్' అంశంపై 500 పదాలకు మించకుండా ఆన్‌లైన్ వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. అభ్యర్థులు తమ వ్యాసాలను ఈ నెల 22వ తేదీలోపు మై భారత్ పోర్టల్‌లో సమర్పించాలని సూచించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన 200 మందిని ఎంపిక చేసి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత కల్పిస్తారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపిన వారిని జనవరి 12, 2027న ఢిల్లీలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా నిర్వహించే జాతీయ యువజన ఉత్సవాలకు ప్రభుత్వ ఖర్చులతో పంపనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు: 9866852915, 8008819556 నంబర్లను కార్యాలయ వేళల్లో సంప్రదించాలని సూచించారు.

# ఓటర్ల జాబితా సవరణకు గడువు పొడిగింపు..!

## జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

## అక్టోబర్ 22 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారం..

## 30న తుది ఓటర్ల జాబితా విడుదల

కడప, మహి న్యూస్ అక్టోబర్ 16: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారానికి అక్టోబర్ 22 వరకు గడువు పొడిగించినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. 2026 జూలై 1వ తేదీని అర్హత తేదీగా పరిగణిస్తూ చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా ఎన్నికల సంఘం ఈ నెల 14న జారీ చేసిన ఉత్తర్వుల మేరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారంతో పాటు నోటీసుల ప్రక్రియ కూడా అక్టోబర్ 22 వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. అక్టోబర్ 30న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నట్లు వెల్లడించారు. ఓటర్లు తమ పేర్లు, చిరునామాలు, ఇతర వివరాలు ఓటర్ల జాబితాలో సక్రమంగా నమోదయ్యాయో లేదో పరిశీలించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఏవైనా తప్పులు లేదా అభ్యంతరాలు ఉంటే నిర్ణీత గడువులోగా సంబంధిత అధికారులను సంప్రదించి పరిష్కరించుకోవాలని కోరారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయడంతో పాటు, సవరించిన షెడ్యూల్‌ను రాజకీయ పార్టీలకు లిఖితపూర్వకంగా తెలియజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# మధ్యవర్తిత్వంతో వివాదాలకు సామరస్యపూర్వక పరిష్కారం

## కడపలో మూడు ప్రాంతాల్లో న్యాయ విజ్ఞాన సదస్సులు

## సమయం, ఖర్చు ఆదా చేసుకోవచ్చు..

## ఉచిత న్యాయ సహాయాన్ని వినియోగించుకోవాలి




కడప, మహి న్యూస్, అక్టోబర్ 16: కుటుంబ వివాదాలు, ఆస్తి తగాదాలు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన సమస్యలను మధ్యవర్తిత్వం ద్వారా సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవచ్చని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప తెలిపింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, అమరావతి ఆదేశాల మేరకు శుక్రవారం బాలాజీనగర్, చిన్నకంపల్లె, నిర్మల ఫార్మసీ కళాశాల ప్రాంతాల్లో ప్రజలకు మధ్యవర్తిత్వంపై న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రామ గోపాల్, అదనపు సీనియర్ సివిల్ జడ్జి, ఇన్‌చార్జి కార్యదర్శి జి.సి. ఆసిఫా సుల్తానా సూచనల మేరకు మధ్యవర్తి న్యాయవాదులు, న్యాయ సహాయ రక్షణ న్యాయవాదులు ఈ అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన మధ్యవర్తి న్యాయవాదులు మాట్లాడుతూ, మధ్యవర్తిత్వం ద్వారా ఇరుపక్షాల పరస్పర అంగీకారంతో వివాదాలను పరిష్కరించుకోవచ్చని వివరించారు. దీనివల్ల సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు కోర్టుల చుట్టూ తిరగాల్సిన ఇబ్బందులు తగ్గుతాయని తెలిపారు. మధ్యవర్తిత్వ ప్రక్రియలో శిక్షణ పొందిన మధ్యవర్తులు ఇరుపక్షాల మధ్య చర్చలకు సహకరిస్తారని, ఎవరికీ అన్యాయం జరగకుండా పరస్పర అంగీకారంతో పరిష్కారం సాధించేందుకు కృషి చేస్తారని పేర్కొన్నారు. చిన్నచిన్న వివాదాలను పెద్దవిగా మార్చకుండా, స్నేహపూర్వక వాతావరణంలో పరిష్కరించుకునేందుకు మధ్యవర్తిత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. అర్హులైన వారు ఉచిత న్యాయ సహాయం, న్యాయ సలహాలు పొందేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో న్యాయ సహాయ రక్షణ న్యాయవాదులు, న్యాయ సేవా స్వచ్ఛంద కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.












# శ్రీపీఠం అన్నదానానికి పిల్లంక భక్తుల కూరగాయల వితరణ



తాళ్ళరేవు, మహి న్యూస్, అక్టోబర్ 16: కాకినాడ శ్రీపీఠంలో శరన్నవరాత్రుల సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీశక్తి యాగంలో భాగంగా ప్రతిరోజూ భారీ స్థాయిలో అన్నదాన కార్యక్రమం కొనసాగుతోంది. నిత్యం సుమారు 20 వేల నుంచి 25 వేల మంది భక్తులకు అన్నప్రసాదం అందిస్తున్నారు. శనివారం అమ్మవారు సరస్వతీ దేవి స్వరూపంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ సందర్భంగా సుమారు 20 వేల మంది చిన్నారులతో సరస్వతీ పూజ నిర్వహించనున్నారు. అలాగే నిత్యం మహిళలచే లలితా సహస్రనామ పారాయణంతో పాటు కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో శ్రీపీఠంలో శనివారం నిర్వహించనున్న అన్నదాన కార్యక్రమానికి అవసరమైన కూరగాయలను పిల్లంక గ్రామానికి చెందిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి భక్తజనులు సమష్టిగా అందజేశారు. అదేవిధంగా శ్రీపీఠంలో కొలువైన ఐశ్వర్యాంబ అమ్మవారికి సుమారు అర కిలో యాలకులతో తయారుచేసిన ప్రత్యేక హారాన్ని సమర్పించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగస్వాములవుతూ అన్నదానానికి తమ వంతు సహకారం అందించిన పిల్లంక భక్తులను పలువురు అభినందించారు.



# కోరింగా ఫార్మసీ కళాశాలలో ఘనంగా దసరా సంబరాలు

## సాంప్రదాయాలను కాపాడుకోవాలి: ప్రగళ్లపాటి కనకరాజు



తాళ్లరేవు, మహి న్యూస్, అక్టోబర్ 16: కోరింగా కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో శుక్రవారం దసరా సంబరాలను సాంప్రదాయబద్ధంగా, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్న ఈ వేడుకలను కళాశాల సెక్రటరీ ప్రగళ్లపాటి కనకరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి ఆటపాటలతో సందడి చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన దాండియా నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచి, అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. కళాశాల ప్రాంగణమంతా పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ప్రగళ్లపాటి కనకరాజు మాట్లాడుతూ.. మన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. భావితరాలకు భారతీయ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని తెలియజేయాలనే ఉద్దేశంతో ప్రతి ఏటా కళాశాలలో సంక్రాంతి, దసరా సంబరాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు పి. నాగమణి, జి. సీత, ప్రిన్సిపాల్ సువర్ణజ్యోతి, ఏఓ కె. మాల తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్‌సీపీకి గుడ్‌బై..
# టీడీపీలోకి మాజీ సర్పంచ్ మట్ట రాంబాబు

## ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గుత్తుల సాయి సమక్షంలో పార్టీలో చేరిక



ఐ పోలవరం, మహి న్యూస్, అక్టోబర్ 16: డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీకి మరో రాజకీయ ఎదురుదెబ్బ తగిలింది. ముమ్మిడివరం మాజీ సర్పంచ్ మట్ట రాంబాబు వైఎస్సార్‌సీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గుత్తుల సాయి సమక్షంలో ఆయన పసుపు కండువా కప్పుకుని టీడీపీలో చేరికను ప్రకటించారు. మట్ట రాంబాబు 2006 నుంచి 2011 వరకు ముమ్మిడివరం సర్పంచ్‌గా పనిచేశారు. యాదవ సామాజిక వర్గానికి చెందిన ఆయనకు నియోజకవర్గంలో రాజకీయంగా మంచి పరిచయాలు ఉన్నాయని, స్థానిక ప్రజలతో సత్సంబంధాలు కలిగిన నాయకుడిగా గుర్తింపు ఉందని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తుందనే నమ్మకంతోనే టీడీపీలో చేరినట్లు మట్ట రాంబాబు తెలిపారు. ఆయన చేరికతో ముమ్మిడివరం నియోజకవర్గంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని టీడీపీ నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.



# శ్రీ మందేశ్వర స్వామి వారి దేవస్థానం

## చిన్నారులచే ఉచిత సామూహిక సరస్వతి పూజ, అక్షరాభ్యాసాలు



కొత్తపేట అక్టోబర్ 16 (సంజీవిని న్యూస్): డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, కొత్తపేట మండలం, మందపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ మందేశ్వర (శనేశ్వర) స్వామి వారి దేవస్థానం నందు ఈరోజు అనగా అక్టోబర్ 16 శుక్రవారం నాడు ఉదయం 9 గంటలకు దసరా మహోత్సవములలో భాగంగా మూలా నక్షత్రం సందర్భంగాలి చిన్నారులచే ఉచిత సామూహిక సరస్వతి పూజ, అక్షరాభ్యాసాలు మరియు మహిళలచే సామూహిక కుంకుమ పూజలు దేవస్థానం అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరిపించబడినది. అనంతరం పూజలో పాల్గొన్న చిన్నారులకు, మహిళలకు అన్నసమారాధన జరిగినది. పూజలో పాల్గొన్న విద్యార్థులకు దేవస్థానం వారు పలక, బలపం, పుస్తకం, పెన్ను మరియు మహిళలకు పూజా సామాగ్రి, పుస్తకం వితరణ చేయుట జరిగినది. ఈ కార్యక్రమంలో దేవస్థానం సహాయ కమీషనర్ మరియు కార్యనిర్వహణాధికారి దారపురెడ్డి సురేష్ బాబు, సహాయ ధర్మకర్తల మండలి సభ్యులు గంధం సత్య వెంకట నాగాజీ, దంగేటి సాయి నాగభూషణం, నేరేడుమిల్లి మహాలక్ష్మి ఏడుకొండలు, గవర వీర వెంకట సత్యనారాయణ, చిలకమర్తి అనంతలక్ష్మి సావిత్రి శ్రీనివాస్, తణుకు వీరభద్రరావు, కోటిపల్లి సుబ్బలక్ష్మి సుబ్రహ్మణ్యం, దేవస్థానం అర్చక మరియు ఎక్స్ అఫీషియో మెంబర్ అయలూరి శ్రీరామమూర్తి మరియు ఇతర గ్రామ పెద్దలు, దేవస్థానం అర్చకులు, వేద పండితులు, సిబ్బంది, గ్రామస్తులు, భక్తులు స్వచ్ఛంద సేవకులు, పాల్గొన్నారు.





# కనకదుర్గ ఆలయంలో ఘనంగా సామూహిక సరస్వతీ పూజలు



యానాం, మహి న్యూస్, అక్టోబర్ 16: యానాం శివారు కనకాలపేట గ్రామంలోని శ్రీ కనకదుర్గ దేవి ఆలయంలో 41వ దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజు శుక్రవారం అమ్మవారు శ్రీ సరస్వతీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు కోణంభట్ల శ్రీరామచంద్రమూర్తి, ఆయన తనయుడు సాయి సతీష్ శర్మ బ్రహ్మత్వంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా హంసాని రామలక్ష్మణుడు, ఉత్తర శ్రీనివాస శ్రీలత కుమారి, భాను వెంకట స్వరూప్--దీప్తి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థులతో సామూహిక సరస్వతీ దేవి పూజలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు బహూకరించారు. విద్యార్థులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించడంతో ఆలయ ప్రాంగణం అమ్మవారి నామస్మరణతో మార్మోగింది. పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కనకాల కృష్ణ, పోలిశెట్టి రామకృష్ణ, కనకాల సూరిబాబు, మల్లిపూడి గోవిందు, కనకాల సత్తిబాబు, గ్రామ పెద్దలు, యువత తదితరులు పాల్గొన్నారు.



# ఎన్నికల భద్రతపై ఎస్పీ క్షేత్రస్థాయి పరిశీలన

## నామినేషన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లు, ఓట్ల లెక్కింపు కేంద్రాల తనిఖీ

## సమస్యాత్మక ప్రాంతాల్లో శాంతిభద్రతలపై సమీక్ష

## ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలి




కర్నూలు, అక్టోబర్ 16: (మహి న్యూస్): ఎన్నికల భద్రతా ఏర్పాట్లలో భాగంగా కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ శుక్రవారం ఎమ్మిగనూరు నియోజకవర్గ పరిధిలోని పలు కీలక ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని, పోలీసు అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముందుగా ఎమ్మిగనూరు మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం బనవాసి సమీపంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లు, ఓట్ల లెక్కింపు కేంద్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి భద్రతా ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఎమ్మిగనూరు పట్టణంలోని మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల పోలింగ్ కేంద్రంతో పాటు వెంకటాపురం, ఆది ఆంధ్ర పాఠశాలలను పరిశీలించారు. ఎమ్మిగనూరు గ్రామీణ పరిధిలోని కడిమెట్ల, ఎర్రకోట వంటి సమస్యాత్మక, సున్నితమైన ప్రాంతాలను సందర్శించి శాంతిభద్రతల పరిస్థితిని సమీక్షించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. అనంతరం ఎమ్మిగనూరు డీఎస్పీ కార్యాలయంలో సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎన్నికల భద్రతా ఏర్పాట్లు, శాంతిభద్రతల పరిరక్షణ, సమస్యాత్మక ప్రాంతాల్లో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సమీక్షించారు. ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు పటిష్టమైన భద్రతా ప్రణాళికను అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మిగనూరు డీఎస్పీ శ్రీనివాసులు, రూరల్ సీఐ చిరంజీవి, టౌన్ సీఐ కంబగిరి రాముడు, టౌన్ ఎస్ఐ మధుసూదన్ రెడ్డి, రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు, నందవరం ఎస్ఐ తిమ్మారెడ్డి పాల్గొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయం, కర్నూలు.







4

RNI : APTEL/25/A0108
మహి న్యూస్
www.mahinewsindia.com
epaper: https://epaper.mahinewsindia.com
తెలుగు దినపత్రిక

తిరుపతి-చిత్తూరు

శనివారం - 17 - అక్టోబర్ - 2026

# తిరుపతి మేయర్ స్థానానికి ఆప్ అభ్యర్థి నామినేషన్

## తొలిరోజు మేయర్ స్థానానికి ఒక నామినేషన్

## కార్పొరేటర్ స్థానాలకు 88 నామినేషన్లు దాఖలు

## వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి అత్యధికంగా 61 నామినేషన్లు

తిరుపతి, అక్టోబర్ 16: (మహి న్యూస్): తిరుపతి నగరపాలక సంస్థ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ తొలిరోజు శుక్రవారం మేయర్ స్థానానికి ఒకటి, కార్పొరేటర్ స్థానాలకు 88 నామినేషన్లు దాఖలయ్యాయి. మేయర్ అభ్యర్థిగా ఆమ్ ఆద్మీ పార్టీ తరఫున నీరుగట్టు నగేష్ నామినేషన్ సమర్పించారు. కార్పొరేటర్ స్థానాలకు పార్టీలు, ఇతర అభ్యర్థుల నుంచి వచ్చిన నామినేషన్ల వివరాలు ఇలా ఉన్నాయి.




తెలుగుదేశం పార్టీ - 10
వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ - 61
జనసేన పార్టీ - 4
సీపీఐ - 1
ఇతరులు - 12

తొలిరోజు మేయర్, కార్పొరేటర్ స్థానాలకు కలిపి మొత్తం 89 నామినేషన్లు దాఖలైనట్లు తిరుపతి జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ వెల్లడించింది.

# తపాలా శాఖలో ప్రత్యక్ష ఏజెంట్లుగా పనిచేసేందుకు అవకాశం

## పదో తరగతి ఉత్తీర్ణులకు అర్హత.. ఈ నెల 29 దరఖాస్తులకు చివరి తేదీ

కడప, మహి న్యూస్, అక్టోబర్ 16: భారత తపాలా శాఖ ఆధ్వర్యంలో పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ (పీఎల్ఐ), గ్రామీణ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ (ఆర్పీఎల్ఐ) పథకాల ప్రత్యక్ష ఏజెంట్లుగా పనిచేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కడప డివిజన్ తపాలా కార్యాలయాల సూపరింటెండెంట్ జి. రాజేష్ తెలిపారు. పదో తరగతి లేదా అంతకంటే ఎక్కువ విద్యార్హత కలిగిన వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులు ప్రజలకు జీవిత బీమా పథకాలపై అవగాహన కల్పిస్తూ, నిబంధనల ప్రకారం ప్రోత్సాహకాలు పొందడంతో పాటు అదనపు ఆదాయం సంపాదించవచ్చని వివరించారు. ప్రత్యక్ష ఏజెంట్లుగా పనిచేయడానికి నిబంధనల ప్రకారం రూ.5,000 విలువైన జాతీయ పొదుపు పత్రాన్ని (ఎన్ఎస్సీ) డిపాజిట్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. స్వయం సహాయక సంఘాల నాయకులు, చురుకైన సభ్యులు, ఇతర ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్హులైన సభ్యులకు ఈ సమాచారాన్ని తెలియజేసి, తపాలా శాఖ ప్రత్యక్ష ఏజెంట్లుగా పనిచేసేందుకు ప్రోత్సహించాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 29వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు: కడప డివిజన్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ అభివృద్ధి అధికారి పి. మునాఫ్‌ను 6303248943 నంబరులో సంప్రదించాలి.

# మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు అందుబాటులో నామినేషన్ పత్రాలు

మదనపల్లె, మహి న్యూస్, అక్టోబరు 16: మదనపల్లె మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయదలచిన అభ్యర్థులకు నామినేషన్ పత్రాలు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అందుబాటులో ఉంటాయని మున్సిపల్ కమిషనర్ ప్రమీల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు మున్సిపల్ కార్యాలయం నుంచి నామినేషన్ పత్రాలను తీసుకొని, వాటిలోని నిర్ణీత కాలాలను పూర్తి సమాచారంతో నింపి, అవసరమైన ధ్రువీకరణ పత్రాలను జతచేయాలని సూచించారు. పూర్తి చేసిన నామినేషన్ పత్రాలను మదనపల్లెలోని దొంతి లేఅవుట్ వద్ద, మున్సిపల్ వాహన పార్కింగ్ సమీపంలో ఉన్న సహాయ ఎన్నికల అథారిటీ నూతన భవనంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రంలో దాఖలు చేయవచ్చని కమిషనర్ ప్రమీల ఆ ప్రకటనలో తెలిపారు.

# వైభవంగా శ్రీ దుర్గా మల్లేశ్వరుల దివ్య నగరోత్సవం



ఇంద్రకీలాద్రి, మహి న్యూస్, అక్టోబర్ 16: శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో అత్యంత వైభవంగా జరుగుతున్న దసరా శరన్నవరాత్రి మహోత్సవాలలో ఆరవ రోజు, అమ్మవారి జన్మనక్షత్రమైన పరమ పవిత్ర మూలా నక్షత్రం పర్వదినాన శుక్రవారం సాయంత్రం ఆదిదంపతులైన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దివ్య నగరోత్సవం భక్తుల జయజయధ్వానాల నడుమ ఆధ్యాత్మిక శోభతో అత్యంత వైభవోపేతంగా జరిగింది. ఇంద్రకీలాద్రి శిఖరాన జగన్మాత శ్రీ కనకదుర్గ అమ్మవారు శ్వేతాంబరియై, వీణాపాణిగా సాక్షాత్తు జ్ఞానప్రదాయిని శ్రీ సరస్వతీ దేవి దివ్యాలంకారంలో భక్తులకు కరుణామృత దృష్టితో దర్శనమిస్తుండగా, పరమ పవిత్రమైన ప్రదోషకాల సమయంలో కొండపై కొలువుదీరిన శ్రీ మల్లేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో ఉత్సవ మూర్తులకు ప్రధాన అర్చకులు శాస్త్రోక్తంగా విశేష పూజలు, దివ్య మంగళ హారతులు నిర్వహించారు. అనంతరం మంగళవాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ నగరోత్సవం అత్యంత కోలాహలంగా ప్రారంభమైంది. నగరోత్సవ రథం ముందుకు కదులుతుండగా సుమధుర శాక్సోఫోన్ వాయిద్యాలు, సంప్రదాయ కేరళ పంచవాద్యాల దరువులు, గుస్సాడీ కళావిన్యాసాలు మరియు మహిళా భక్తుల లయాన్విత కోలాటాలు వీధుల్లో ఆధ్యాత్మిక వాతావరణాన్ని ప్రతిధ్వనింపజేశాయి. శ్రీ మల్లేశ్వర స్వామి ఆలయం వద్ద ప్రారంభమైన ఊరేగింపు రథం సెంటర్, వన్ టౌన్ వినాయక గుడి, కెనాల్ రోడ్డు, పవిత్ర కృష్ణా నదీ తీరాన ఉన్న దుర్గా ఘాట్ మీదుగా ఘాట్ రోడ్డు ద్వారా సాగింది. వేలాది మంది భక్తులు పాదయాత్రగా నగరోత్సవం వెంట నడుస్తూ “జై భవానీ.. జై జై భవానీ”, “ఓం శ్రీ మాత్రే నమః” అంటూ చేసిన జయజయధ్వానాలతో ఇంద్రకీలాద్రి పరిసరాలు మార్మోగాయి. సర్వాంగసుందరంగా విద్యుద్దీపాలు, సుగంధ పుష్పాలతో ముస్తాబు చేసిన రథంపై కొలువుదీరిన ఆదిదంపతులను దర్శించుకునేందుకు పురవీధుల్లో భక్తజనం బారులు తీరారు. మార్గమధ్యంలో భక్తులు కర్పూర హారతులు సమర్పిస్తూ, కొబ్బరికాయలు కొడుతూ స్వామి, అమ్మవార్లకు భక్తిశ్రద్ధలతో ఘన నీరాజనాలు పలికారు. నగరోత్సవం ఘనంగా కొండపైకి చేరుకున్న అనంతరం ఆలయ మహారాజగోపురం ఎదుట సంప్రదాయబద్ధంగా “ఆస్థాన కార్యక్రమం” నిర్వహించారు. ఆలయ స్థానాచార్యుల ఆధ్వర్యంలో వేద పండితులు, అర్చక బృందం ఉత్సవ మూర్తులకు వేదోక్తంగా శాస్త్రోక్త పూజలు, పంచహారతులు సమర్పించారు. చదువుల తల్లి, జ్ఞానస్వరూపిణి అయిన సరస్వతీ దేవి అలంకారంలో కొలువుదీరిన మూలా నక్షత్ర పర్వదినాన ఆదిదంపతులను రథారూఢులుగా దర్శించుకోవడం వల్ల అజ్ఞానం, జడత్వం తొలగి జ్ఞానసంపద, విద్యాబుద్ధులు, కుటుంబ క్షేమం చేకూరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ మహోత్సవంలో ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు, స్థానాచార్యులు, ప్రధాన అర్చకులు, సహాయ కార్యనిర్వహణాధికారి,ఆలయ ఉద్యోగులు, అశేష భక్తజనం పాల్గొని ఆదిదంపతుల కృపాకటాక్షాలను పొందారు.

# అనకాపల్లి జోన్-10 కూటమి అభ్యర్థుల ఎంపికపై వీడని ఉత్కంఠ!




అనకాపల్లి: అనకాపల్లి జోన్-10లోని ఆరు వార్డులకు కూటమి అభ్యర్థుల ఎంపికపై ఉత్కంఠ కొనసాగుతోంది. టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల నుంచి ఇప్పటివరకు అభ్యర్థుల జాబితా వెలువడకపోవడంతో టికెట్లు ఆశిస్తున్న వారిలో టెన్షన్ నెలకొంది. మరోవైపు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను ఖరారు చేసినట్లు ప్రచారంలో ఉన్న ఓ జాబితా రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. కూటమిలోని మూడు పార్టీల నుంచి టికెట్ ఎవరికి దక్కుతుందనే అంశంపై ఆశావహుల్లో అయోమయం నెలకొంది. అభ్యర్థుల బలాబలాలు, స్థానికంగా ఉన్న పరిస్థితులు, గెలుపు అవకాశాలకు సంబంధించిన అంశాలను పార్టీ నాయకత్వాలు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. జనసేన తరఫున అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, టీడీపీ తరఫున నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీలా గోవింద సత్యనారాయణ అభ్యర్థుల ఎంపికపై ఆచితూచి వ్యవహరిస్తున్నట్లు సమాచారం. ఆశావహులతో చర్చలు జరుపుతూ, అందుబాటులో ఉన్న వివరాలను పరిశీలించి అభ్యర్థుల జాబితాను సిద్ధం చేసే ప్రక్రియలో ఉన్నట్లు తెలుస్తోంది. ఆరు వార్డుల్లో కూటమి తరఫున ఎవరికి అవకాశం దక్కుతుంది? ఏ పార్టీకి ఎన్ని స్థానాలు కేటాయిస్తారు? అనే ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. అధికారిక జాబితా విడుదలయ్యే వరకు ఆశావహుల్లో ఉత్కంఠ కొనసాగనుంది.

# నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ తుషార్ డూడి

## ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి

## నామినేషన్ కేంద్రాల్లో భద్రతా చర్యల పరిశీలన

## ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై కఠిన చర్యలు

పలమనేరు, అక్టోబర్ 16: (మహి న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికలనుప్రశాంతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు




అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. శుక్రవారం పలమనేరు మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, ఎస్పీ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సదుపాయాలు, భద్రతా చర్యలు, అధికారుల విధుల నిర్వహణ, ఎన్నికల నియమావళి అమలుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం నామినేషన్ల



ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అభ్యర్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని, ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా చూడాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ఎస్పీ తుషార్ డూడి మాట్లాడుతూ, ఎన్నికలు భయరహిత వాతావరణంలో జరిగేలా చిత్తూరు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. నామినేషన్ కేంద్రాల వద్ద అదనపు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు నిరంతర పర్యవేక్షణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం, అభ్యర్థులు లేదా వారి మద్దతుదారులను బెదిరించడం, ఓటర్లను ప్రలోభపెట్టడం, భయభ్రాంతులకు గురిచేయడం, గుంపులుగా చేరి ఉద్రిక్తతలు సృష్టించడం వంటి చర్యలను సహించబోమని హెచ్చరించారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినా, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా ఎన్నికల ప్రక్రియలో పాల్గొనాలని ఎస్పీ సూచించారు. బెదిరింపులు, ప్రలోభాలు, గొడవలు లేదా అనుమానాస్పద కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు




తెలియజేయాలని కోరారు. సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు, రెచ్చగొట్టే పోస్టులు, నిర్ధారణ కాని సమాచారాన్ని ప్రచారం చేయవద్దని సూచించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉంటుందని, ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో పలమనేరు ఆర్డీఓ భవాని, మున్సిపల్, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలి

## ఎన్నికల కమిషన్ సూచనల మేరకే విధులు నిర్వర్తించాలి

## ఆర్వో హ్యాండ్‌బుక్‌లోని నిబంధనలపై పూర్తి అవగాహన ఉండాలి

## నామినేషన్ల స్వీకరణలో పారదర్శకత పాటించాలి

చిత్తూరు, అక్టోబర్ 16: (మహి న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికల విధులను అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా నిర్వహించాలని



జిల్లా పరిషత్ సీఈవో రవికుమార్ నాయుడు సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలు, మార్గదర్శకాల మేరకే విధులు నిర్వర్తించాలని స్పష్టం చేశారు. శుక్రవారం చిత్తూరు జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణపై



అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిర్దేశించిన గడువులోగా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉన్నందున అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల అనంతరం మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికలు, ఆ తర్వాత గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగుతాయని పేర్కొన్నారు. రిటర్నింగ్ అధికారులు (ఆర్వోలు), సహాయ రిటర్నింగ్ అధికారులు (ఏఆర్వోలు) ఆర్వో హ్యాండ్‌బుక్‌లోని ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని సూచించారు. ఎన్నికల సమయంలో సొంత నిర్ణయాలు తీసుకోకుండా ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం వ్యవహరించాలని స్పష్టం చేశారు. అధికారులకు కేటాయించిన డివిజన్లలో ఓటర్ల జాబితాలను పరిశీలించాలని, ఓటర్ల ప్రాతిపదికన రిజర్వేషన్ల కేటాయింపు, పోలింగ్ కేంద్రాల తనిఖీ, మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించాలని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండేలా ఓటర్ల జాబితాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు.

### నామినేషన్ల స్వీకరణలో పారదర్శకత పాటించాలి

స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహించాలని చిత్తూరు డీఎల్‌డీఓ రవికుమార్, సౌందర్ రాజన్ సూచించారు. నామినేషన్ పత్రాల పరిశీలన, అవసరమైన ధ్రువపత్రాల ధృవీకరణ, అభ్యర్థుల అర్హతలు, నామినేషన్ల తిరస్కరణకు సంబంధించిన నిబంధనలపై అధికారులకు వివరించారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియల్లో ఎలాంటి పొరపాట్లకు



తావులేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన గడువులను తప్పనిసరిగా పాటిస్తూ ఎన్నికలను ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు, డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి, డ్వామా పీడీ రవికుమార్, జిల్లా విద్యాశాఖ డీఈవో లక్ష్మీనారాయణ, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు. విడుదల: డీడీ, సమాచార పౌరసంబంధాల శాఖ, చిత్తూరు.

# స్థానిక సంస్థల ఎన్నికలను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించాలి

మదనపల్లె, మహి న్యూస్, అక్టోబరు 16 :- అన్నమయ్య జిల్లాలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం మదనపల్లి కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో స్థానిక సంస్థల ఎన్నికల సంసిద్ధత, నామినేషన్లు, పోలింగ్ కేంద్రాలు, భద్రత, ఎన్నికల సామగ్రి నిర్వహణ తదితర అంశాలపై జిల్లా ఎన్నికలనోడల్ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటిస్తూ, ఎలాంటి పొరపాట్లకు, నిర్లక్ష్యానికి తావులేకుండా ఎన్నికల విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న రాజకీయ నాయకుల ఫొటోలు, రాజకీయ ఫ్లెక్సీలు, గోడలపై రాతలు (వాల్ రైటింగ్స్), క్యాలెండర్లు తదితర రాజకీయ ప్రచార సామగ్రిని తక్షణమే తొలగించాలని సూచించారు.



### ఎన్నికల విధుల్లో నిష్పక్షపాత ధోరణి

ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు రాజకీయ పక్షపాతానికి తావులేకుండా తటస్థంగా వ్యవహరించాలన్నారు. సున్నిత, అత్యంత సున్నిత ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలని, శాంతిభద్రతల కోసం పోలీసు శాఖతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

### నామినేషన్ల ప్రక్రియ

మూడు మున్సిపాలిటీలకు సంబంధించిన నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ, తుది అభ్యర్థుల జాబితా ప్రకటనను ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలన్నారు. నామినేషన్ కేంద్రాల్లో అవసరమైన సిబ్బంది, ఏర్పాట్లు ఎప్పటికప్పుడు సమన్వయం చేయాలని ఆదేశించారు.

### పోలింగ్, కౌంటింగ్ ఏర్పాట్లు

పోలింగ్, రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూములు, బ్యాలెట్ పేపర్ల ముద్రణ ప్రదేశాలను ముందుగానే గుర్తించి ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. బ్యాలెట్ పేపర్ల ముద్రణ, రవాణా, భద్రపరిచే ప్రక్రియకు పోలీసు భద్రత కల్పించాలని, పోలింగ్ అనంతరం స్ట్రాంగ్ రూముల వద్ద నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు. పోలింగ్, కౌంటింగ్‌కు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు.

### శాఖల సమన్వయం, నియమావళి అమలు

రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల సామగ్రి తరలింపు, స్ట్రాంగ్ రూముల భద్రత, పోలింగ్ కేంద్రాల బందోబస్తు, సున్నిత ప్రాంతాల్లో నిఘాపై పోలీసు అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకోవాలన్నారు. అనుమతి లేకుండా రాజకీయ ఫ్లెక్సీలు, ప్రచార బోర్డులు ఏర్పాటు చేయరాదని స్పష్టం చేశారు. ప్రతి అధికారి రోజువారీ సమీక్షల ద్వారా సమస్యలను వెంటనే పరిష్కరించి, నిర్ణీత కాలపరిమితిలో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్ఓ ఏ. వెంకటేష్, ఆర్డీవో విజయలక్ష్మి, ఎస్డిసి మాధవ కృష్ణారెడ్డి, జిల్లా పరిషత్ సీఈఓ లక్ష్మీపతి, జిల్లా పంచాయతీ అధికారి రాధమ్మ, జిల్లా నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కనకదుర్గమ్మకు సీఎం చంద్రబాబు దంపతులు చీర, సారె సమర్పణ

విజయవాడ, మహి న్యూస్, అక్టోబర్ 16:- ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీ కనకదుర్గమ్మను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సతీసమేతంగా దర్శించుకున్నారు. దసరా నవరాత్రుల సందర్భంగా ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు, సారె సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించినట్లు సీఎం తెలిపారు. దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయానికి చేరుకున్న ముఖ్యమంత్రి దంపతులకు అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్థానాచార్యులు శివప్రసాద్ శర్మ ముఖ్యమంత్రికి పరివేష్టం అలంకరించారు. అనంతరం సీఎం పట్టువస్త్రాలు, సారెను అమ్మవారికి సమర్పించారు . పండితుల వేదమంత్రాల నడుమ అమ్మవారి అంతరాలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. సీఎం పట్టువస్త్రాలు సమర్పించే సమయంలోనూ సామాన్య భక్తుల దర్శనాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా క్యూ లైన్లను కొనసాగించారు. పూజల అనంతరం ఆశీర్వచన మండపంలో అర్చకులు సీఎం దంపతులకు వేదాశీస్సులు అందజేశారు. ఈవో శీనానాయక్ అమ్మవారి శేషవస్త్రాలను అందించగా, ఆలయ చైర్మన్, ఈవో అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు.

### 6 రోజుల్లో 8 లక్షల మంది భక్తుల దర్శనం

ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ... ‘రాష్ట్ర ప్రజలందరికీ దసరా శుభాకాంక్షలు. ప్రభుత్వం తరఫున కుటుంబ సమేతంగా అమ్మవారికి చీర, సారె సమర్పించి ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించాను. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ పాలక మండలి, అధికారులు ఏర్పాట్లు చేశారు.




ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దసరా ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు. ఆరు రోజుల్లోనే ఎనిమిది లక్షల మంది అమ్మవారిని దర్శించుకున్నారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు భక్తిశ్రద్ధలతో తరలివచ్చి అమ్మవారి ఆశీస్సులు పొందుతున్నారు. విజయవాడ ఉత్సవ్ 2.0, జాతీయ సరస్ మేళా కూడా ఇక్కడే జరుగుతున్నాయి. దేశంలో ప్రముఖంగా నిర్వహించే ఉత్సవాల్లో విజయవాడ దసరా ఉత్సవాలు చోటు సంపాదించుకోవడం శుభపరిణామం. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించాను. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలని ఆకాంక్షించాను. ఆంధ్రప్రదేశ్‌ను ఆరోగ్యకరమైన, సంపన్నమైన, సంతోషకరమైన సమాజంగా తీర్చిదిద్దాలని అమ్మవారిని కోరుకున్నాను’ అని సీఎం చంద్రబాబు అన్నారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED 9147/1, SRI LAKSHMI NARASIMHA YOGIMAILAVARAM ARCH ROAD, YOGIMAILAVARAM,TIRUPATHI,AP - 517503.A.P .VSAR PUBLICATIONSDOOR NO. 403, PANTA STREET, TIRUPATHI - 517501.RNI NO : APTEL/26/A5325. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com